క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: ఒంటి పూట బడుల నిర్వహణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పక సమయ పాలన పాటిస్తూ నిబంధనలు పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టులో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బద్రూనాయక్, సీఆర్పీ గోవింద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడులో క్రీడాకారులకు గురువారం ఎస్‌ఎంజీ స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సత్యారెడ్డి క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు క్రికెట్ ప్రాక్టీస్ కోసం కావల్సిన సామగ్రి ఇవ్వాలని ఎస్‌ఎంజీ స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సత్యారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో యువకులకు కిట్లు అందజేసి యువకులు క్రీడారంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

‘టీబీ’పై అవగాహన



చిన్నంబావి: మండలంలోని బెక్కెంలో గురువారం టీబీ వ్యాధిపై డాక్టర్ వంశీకృష్ణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీపై జాగ్రత్తగా ఉండాలని, వ్యాధి వచ్చిన వారు సరైన పోషక పదార్థాలు, చికిత్స తీసుకోవాలన్నారు. అనుమానితులు ఎవరైనా ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమవర్ధన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



వనపర్తి క్రైం: పట్టణానికి చెందిన కొమ్ము సామేల్‌ను బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈసందర్భంగా గురువారం నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఎస్సీ మోర్చ కార్యదర్శిగా, వనపర్తి పట్టణ ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, ఒక పర్యాయం ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశానని.. సేవలు గుర్తించిన పార్టీ మరోమారు అవకాశం కల్పించిందని కొమ్ము సామేల్ అన్నారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష, ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

వర్గీకరణ ఉద్యమంలో కలిసిరండి



వీపనగండ్ల: కేంద్రప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పూర్తి చేస్తామని ప్రకటించి, ఆ తర్వాత విస్మరించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ అన్నారు. వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కోసం మాదిగల సంగ్రామయాత్రలో ఆయన పాల్గొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మంద నరసింహ, రాజేష్, పరమేష్, కురుమయ్య, సహదేవుడు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని సింగాయిపల్లికి చెందిన శివయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబాన్ని ఎన్‌వీ పౌండేషన్ చైర్మన్ నక్క గోపాల్‌యాదవ్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

భూ పరిహారం అందించేదెప్పుడో?

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- నేటికీ ఆరేళ్లు కావస్తున్నా అందని వైనం
- ఆందోళనలో అన్నదాతలు



పరిహారం చెల్లించాలని జిల్లా అధికారులకు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న రైతులు(ఫైల్)



రైతుల పొలాల ద్వారాతవ్విన మేజర్-4 కాల్వ

పాన్‌గల్: మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్‌ఐ ప్రాజెక్టు)లో భాగంగా డీ-8 కాల్వకు అనుబంధంగా ఉన్న మేజర్ కాల్వల ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఆరేళ్లు కావస్తున్నా నేటికీ పరిహారం అందలేదు. రైతులు పరిహారం కోసం ప్రజాప్రతినిధులు, సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. తమ పొలాలకు సాగునీరు అందడంతో పాటు పరిసర ప్రాంత రైతులకు కాల్వలు రాకతో ఉపయోగం ఉంటుందన్న ఉద్దేశ్యంతో పరిహారం అందక ముందే పెద్దమనుసు చేసుకొని పనులు చేపట్టడానికి అంగీకరించిన రైతులకు అధికారుల అలసత్వంతో అవస్థలు తప్పడం లేదు. మండలంలో డీ-8కు అనుబంధంగా మేజర్ 4, 6 కాల్వలు ఉన్నాయి. కాల్వలో భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి పరిహారం అందగా.. మరి కొందరికి నేటికీ మంజూరు కాక నానాఅవస్థలు పడుతున్నారు.

మండలంలో పరిస్థితి ఇలా..

కేఎల్‌ఐ డీ-8 కాల్వకు అనుబంధంగా మండలంలోని రేమద్దుల శివారులో మేజర్-4 కాల్వ కిష్టాపూర్, గోప్లాపూర్, అన్నారంతండా, దావాజిపల్లి, దత్తాయిపల్లి వరకు 21 కిలోమీటర్ల దూరం ఉంది. అందులో కిష్టాపూర్ శివారులో 45 మందికి, గోప్లాపూర్ శివారులో 67 మంది రైతులకు పరిహారం అందింది. మిగిలిన అన్నారంతండా శివారులో అయిదుగురికి, దావాజిపల్లి ప్రాంతంలో 42 మంది రైతులకు సంబంధించి దాదాపుగా 27 ఎకరాలు కాల్వల తవ్వకానికి కోల్పోయారు. దీంతో పాటు మేజర్-6 కాల్వ తవ్వకంలో శాగాపూర్, మాధరావుపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి వరకు 10.7 కిలోమీటర్లు దూరం విస్తరించింది. ఈ కాల్వలో 80 మంది రైతులకు సంబంధించి దాదాపుగా 135 ఎకరాల భూమికి నష్టం జరిగింది. ఈ గ్రామాల రైతులకు ఇంకా పరిహారం అందలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిహారం వెంటనే మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆరేళ్లుగా ఎదురుచూపులే..



ఎంజే-6 కాల్వ తవ్వకంలో భూమి కోల్పోయి పరిహారం కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నాం. కాల్వ తవ్వకంలో నాకు సంబంధించిన 2.30 ఎకరాల భూమికి నష్టం వాటిల్లింది. సాగునీరు వస్తుందనే ఉద్దేశ్యంతో భూమికి పరిహారం మంజూరు కాకపోయిన తవ్వకాలకు ఇబ్బందులు కలిగించలేదు. కానీ పనులు పూర్తయినా అధికారులు నష్ట పరిహారం చెల్లించట్లేదు.

– నర్సింహానాయుడు, రైతు, మాధరావుపల్లి

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ఎంజే-4 కాల్వ తవ్వకంలో 1.02 గుంటల భూమి కోల్పోయాను. పనులు పూర్తై ఆరేళ్లు కావస్తున్నా పరిహారం మంజూరు కాలేదు. పరిహారం కోసం ప్రజాప్రతినిధులు, సంబంధిత కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా.. నేటికీ మంజూరు కాలేదు. రైతుల ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిహారం త్వరగా మంజూరు చేసి తమ ఇబ్బందులను తొలగించాలి.

– రేక్యానాయక్, రైతు, అన్నారంతండా

బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం

సాగునీటి కాల్వల తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం వివరాలను బిల్లులు చేసి టోకెన్ నెంబర్లు వేసి ప్రభుత్వానికి పంపించాం. పరిహారం పెంపు విషయంలో జాప్యం జరిగింది. మంజూరైతే రైతులకు తెలియపర్చి అందజేస్తాం.

– మల్లికార్జున్, సూపరింటెండెంట్, భూసేకరణ కార్యాలయం, వనపర్తి

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్ నుంచి తిర్మలాయపల్లి రోడ్డు బీటీ రెనివల్ కోట్ పనులు గురువారం ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ కబీర్‌దాస్ తెలిపారు. ఇప్పటికే ఆగారం నుంచి కమాలోద్దీన్‌పూర్ వరకు రూ.72 లక్షలతో బీటీ రెనివల్ పనులు పూర్తి చేశామని చెప్పారు. రూ.1.55కోట్ల నిధులతో తిర్మలాయపల్లి రోడ్డు పనులు చేపట్టామన్నారు. త్వరలోనే మండలంలోని అప్పారెడ్డిపల్లి, వెంకటాంపల్లి గ్రామాల రోడ్ల బీటీ పనులు చేపడతామని వెల్లడించారు.

షాపు దగ్ధం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో కిరాణం షాపు దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. షాపు యజమాని తెలిపిన వివిరాల ఇలా ప్రకారం.. బుధవారం రాత్రి 11 గంటలకు షాపు మూసి ఇంటికి వచ్చానని, రాత్రి 2 గంటలకు షాపునకు నిప్పంటుకొని మంటలు వ్యాపించడంతో గ్రామంలో ఓ రైతు పంటపొలానికి వెళ్తూ చూసి సమాచారం ఇచ్చాడని తెలిపారు. అక్కడికి చేరుకొని చుట్టు పక్కవారి సహకారంతో నీళ్లు చల్లి మంటలను అదపు చేసినట్లు తెలిపారు. షాపులో కాలిపోయిన వస్తువుల విలువ దాదాపుగా రూ.50 వేలు ఉంటుదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు షాపుకు నిప్పంటించినట్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు వచ్చే రోజువారి కూలీలు 50 నుంచి 100 మంది వరకు ఉండాలని, కార్యదర్శులు రెగ్యూలర్‌గా పనులను పర్యవేక్షిస్తూ మస్టర్లను తనిఖీలు చేయాలని, ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో రోజు వారీ కూలీల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. లేనిచో కూలీలకు పేమెంట్ నిలిచిపోతుందని, దాంతో వారు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉపాధి పనులు సాగునీటి కాల్వలు, చెరువులో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలు పెరిగేలా చూడాలని, పంచాయతీల్లో వందశాతం పన్నుల వసూళ్లు, నిరంతరంగా పారిశుద్ధ్యం పనులను చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా ఆయా పనులపై ఆరా తీశారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు కోసం గురువారం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ స్వరన్‌సింగ్, వనపర్తి మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మయ్యగౌడ్, మండల తహసీల్దార్ భానుప్రకాష్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలో ఒకే దగ్గర కూరగాయలు, మాంసం, చేపల మార్కెట్ నిర్వహించేలా రైతుబజార్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్)ను నిర్మించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. అందుకుగాను గ్రామంలో స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. అధికారులు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచు యాదయ్య, ఎంపీటీసీ సభ్యులు క్యామ వాణి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఐపై కేసు నమోదు చేయాలి



శివయాదవ్‌ను పరామర్శిస్తున్న చక్రవర్తి

కొత్తకోట రూరల్: చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఓ యువకుడిని విచక్షణ రహితంగా కొట్టిన కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దమందడి మండలం మనిగిళ్లకు చెందిన శివయాదవ్ అనే యువకుడు మంత్రి నిరంజన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓ వీడియోను వాట్సాప్ గ్రూప్‌లో వైరల్ చేశాడని ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. దీంతో శివయాదవ్‌ను కానిస్టేబుల్స్ ద్వారా స్టేషన్‌కు పిలిపించి కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి విచక్షణ రహితంగా కొట్టారని, అకారణంగా కొట్టిన సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసి 20రోజులు కావస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. గురువారం శివయాదవ్ ఇంటికి వెళ్లి పరామర్శించి మాట్లాడారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డిపై డీజీపీ విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణంలో యువత భాగస్వామ్యం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం నగదును అందజేస్తున్న మల్లికార్జున్

పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణంలో యువతకు భాగస్వామ్యం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. భాగస్వామ్యం అయిన యువత ఒక్కొక్కరు ఆలయ నిర్మాణానికి రూ.10వేల చొప్పున విరాళం అందజేస్తారని వారు పేర్కొన్నారు. దాదాపుగా వంద మంది యువతను భాగస్వామ్యం చేసినట్లు వారు పేర్కొన్నారు. భాగస్వామ్యం అయిన యువత విరాళాల సేకరణ, ఆలయ నిర్మాణంలో తోడ్పాటునందిస్తారన్నారు. అందులో భాగంగానే లింగాల మల్లికార్జున్ యాదవ్ వారి తాత జ్ఞాపకార్థం రూ.10 వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భాగస్వామ్యం అయిన యువతకు, విరాళాలు అందజేస్తున్న దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్‌యాదవ్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



ఖిల్లాఘనపురం జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 75 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలుల్లో ఉండటంతో ఎస్‌ఐ నాగన్న గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

63 మంది విద్యార్థులు హాజరు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సర పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగాయి. 65 మంది విద్యార్థులకు 63 మంది హాజరయ్యారని చీఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి కృష్ణయ్య తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి. మొదటి రోజు తెలుగు, హిందీ పరీక్షలకు 130 మంది విద్యార్థులను కేటాయించగా 128 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రాధ తెలిపారు.

పద్మనాభస్వామి ఆలయానికి దారి ఏర్పాటు చేయండి



తహసీల్దార్ భానుప్రకాష్‌కు వినతి పత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి మహ్మదుస్సేన్‌పల్లి గ్రామానికి వెళ్లే దారిలో అల్లిపేట గుట్టపై ఉన్న పద్మనాభస్వామి ఆలయానికి వెళ్లడానికి దారి ఏర్పాటు చేయాలని ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తహసీల్దార్ భానుప్రకాష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన ఆలయ అభివృద్ధి కోసం పురావస్తు శాఖ అధికారులు, రాష్ట్ర మంత్రులను కలిశామన్నారు. దారి ఏర్పాటు విషయంలో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని తహసీల్దార్‌కు వివరించామని తెలిపారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి దారి ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవడం వలన భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి పూజలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీనుయాదవ్, ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీను, ఉపాధ్యక్షుడు కొరిగెల గోపాల్ ముదిరాజ్, కోశాధికారి రాజు, కార్యదర్శి శివ, పురుషోత్తం ముదిరాజ్, విక్రం, తిరుపతి, శివశంకర్, కిషోర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో మతాలను రెచ్చగొట్టేందుకు భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని.. వెంటనే ఆ పనులను ఆపాలని కోరుతూ గురువారం హిందూవాహిని నాయకులు డిప్యూటీ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా హిందూవాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణమైన వనపర్తిలో మతాలు రెచ్చగొట్టే విధంగా అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ.. ప్రజల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఇలాంటి వాటికి అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని నాయకులు తిరుపతి, రాము, సురేష్, వెంకటస్వామి, నరేందర్, భాస్కర్, సంపత్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న హిందూవాహిని నాయకులు

మాదాసి కురువలకు న్యాయం చేయాలి



నిరసన చేస్తున్న మాదాసీకుర్వ సంఘం నాయకులు

ఆత్మకూర్: మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని మాదాసి కుర్వ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో ఆసంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుర్వ డప్పుల మోతతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంచార జాతులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. గొర్రెల కాపరులుగా సంచార జీవితం కొనసాగిస్తున్న తమ కుటుంబాలు దుర్భర జీవితాలను బతుకీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, వెంకటన్న, సత్యన్న, శ్రీశైలం, బాలరాజు, తిరుపతయ్య, సీతారాములు, పెద్దమల్లేష్, లక్ష్మన్న, బాలస్వామి, కుర్వరవి తదితరులు ఉన్నారు.

పశువుల పాక దగ్ధంపై ఫిర్యాదు

అమరచింత: మండలంలోని సింగంపేటలో పశువుల కొట్టం తగలబెట్టడంతో అందులో నిలిపి ఉంచిన మోటార్ బైక్ కాలిపోయిందని బాధితుడు బోయ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బోయ శ్రీను తన వ్యవసాయ పొలంలో వేసుకున్న పశువుల కొట్టంలో రెండు రోజుల కిందట తన మోటార్‌బైక్‌ను నిలిపి ఉంచాడు. పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పశువుల పాకకు నిప్పుపెట్టారని వాపోయారు. తన పక్క పొలానికి చెందిన వ్యక్తులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులైన విద్యార్థులు

కొత్తకోట: పామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంచుకున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా ఆయా తరగతులకు వెళ్లి పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిణిగా భార్గవి, ఎంఈఓగా పల్లవి, ప్రధానోపాధ్యాయులుగా కావేరి, ఉపాధ్యాయులుగా బ్లెస్సిక, అక్షిత, ఈశ్వరి, గాయత్రి, గణేష్, దినేష్, చిత్ర, శివ తో పాటు మరో 10 మంది పీఈటీలు, అటెండర్లుగా వ్యవహరించారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్ కుమార్, నుస్రత్‌బేగం, గంగమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటివెలుగు’



హీర్లతండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌నాయక్

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి, తెల్లరాళ్లపల్లితండా, రేమద్దుల గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం దొండాయిపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు శిబిరంపై కరపత్రాలను పంపిణీ చేసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

169 మందికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 169 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో తొమ్మిది మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశామని, ఆరుగురికి అవసరమైన అద్దాల తయారీకి పంపించామన్నారు. ఐదుగురిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని హీర్లతండా సర్పంచు గోపాల్‌నాయక్ అన్నారు. గురువారం తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, తండావాసులతో కలిసి ప్రారంభించారు. తండాలో మొత్తం 194 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 10 మందికి అద్దాలు పంపిణీ చేయగా, ఇద్దరికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించామని వైద్య సిబ్బంది నర్సింహులు చెప్పారు.